ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
09-01-2025
గురువారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 119 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి

# విశాఖలో ప్రధాని మోడీ రోడ్ షో



- మోడీకి ఘన స్వాగతం..
- కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన
- సాగరతీరం.. జన సంద్రం...
- పాల్గొన్న సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్
- కార్యక్రమానికి పోటెత్తిన నగర వాసులు

**విశాఖపట్నం:**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విశాఖలో నిర్వహించిన రోడ్ షో లో విశాఖవాసులు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. ఒక రోజు జిల్లా పర్యటనలో భాగంగా విశాఖ చేరుకున్న పీఎం ఐఎన్ఎస్ డేగా నుంచి సాయంత్రం స్థానిక వెంకటాద్రి కి చేరు కున్నారు. అక్కడ ప్రత్యేకంగా ఏర్పా టుచేసిన ఓపెన్ టాప్ వాహనంలో ప్రధాని నరేంద్ర మోదీ,రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రోడ్ షో నిర్వహించారు.ఈ క్రమంలో ప్రధాని, ముఖ్య మంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రజల నుంచి పూల వర్షంతో నీరాజనాలు అందుకున్నారు. వెంకటాద్రి వంటి ల్లు నుంచి ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వరకు సుమారు కిలో మీటరు మేర భారత ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ వాహనంపై నుంచి ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేసి ముందుకు సాగారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ ప్రధాని ముందుకు సాగారు. ఈ రోడ్ షోలో కూటమి నేతలు, పార్టీ శ్రేణులు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరు కాగా మోదీ.. మోదీ.. అనే నామస్మరణ తో విశాఖ ప్రాంతం మారుమోగింది. మోదీ, చంద్రబాబు, పవన్ రోడ్ షో పట్ల విశాఖ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

2 లో

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- స్వయం సహాయక సంఘాల ద్వారా వెయ్యి మెగావాట్ల ఉత్పత్తి
- త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**జయభేరి, భద్రాద్రి :**
రాష్ట్రంలో మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ప్రజా ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటికే ఇంధన శాఖ, గ్రామీణ అభివృద్ధి శాఖ ల ఒప్పందం కుదిరిన నేపథ్యంలో జిల్లాల వారీగా ప్రగతిని బుధవారం ఉదయం ప్రజా భవన్ లో మంత్రులు సీతక్క, కొండ సురేఖలతో కలిసి డిప్యూటీ సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పాల్గొన్నారు. మహిళలు ఆర్థిక సాధికారత సాధిస్తేనే వారి ఎదుగుదలకు అవకాశాలు ఏర్పడతాయని డిప్యూటీ సీఎం తెలిపారు. అందుకుగాను అంది వస్తున్న కొత్త విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణ అభివృద్ధి శాఖల మధ్య గత సంవత్సరం నవంబర్ 19న కుదిరిన ఒప్పందాన్ని జిల్లా కలెక్టర్లు ఉపయోగించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఐదు సంవత్సరాల కాలంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిద్దాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ క్రమంలో మహిళలకు పెద్ద ఎత్తున వడ్డీ లేని రుణాలు అందుబాటులోకి తెస్తున్నాం. పెద్ద మొత్తంలో డబ్బులు మహిళా సంఘాల చేతులకి వస్తున్న క్రమంలో వారు వివిధ వ్యాపారాలు చేసుకునేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి వసతులు కల్పించాలని ఆదేశించారు.
మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్ ల ఏర్పాటుకు వారికి అందుబాటులో

...మిగతాది 2 లో



# సాగు చేసే రైతులకే భరోసా

**జయభేరి, నిజామాబాద్, జనవరి 8:**
తెలంగాణ ప్రభుత్వం రైతులకు గుడ్ న్యూస్ చెప్పింది. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు రైతు భరోసా పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద ప్రతి ఎకరానికి రూ.12 వేలు ఆర్థిక సాయం చేస్తామని వెల్లడించింది. రైతు భరోసా ఇన్ని ఎకరాలకు మాత్రమే అనే పరిమితి లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ పథకం అమలుకు ప్రభుత్వం భారీ కసరత్తు చేసింది. రైతులు, రైతు సంఘాలతో సమావేశాలు నిర్వహించి...వారి అభిప్రాయాలు సేకరించారు. చివరకు ఎలాంటి పరిమితి లేకుండా సాగు చేస్తున్న ప్రతి ఎకరానికి రైతు భరోసా ఇస్తామని ప్రభుత్వం నిర్ణయించింది.వ్యవసాయం చేస్తున్న, సాగు చేసేందుకు అనుకూలంగా ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా కింద రూ.12 వేలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రాళ్లు, గుట్టలు, పరిశ్రమలకు ఇచ్చిన భూములు, రోడ్లు, వెంచర్ల వేసిన భూములకు రైతు భరోసా ఇవ్వమని స్పష్టం చేసింది. ఇలాంటి భూములున్న వారికి రైతు భరోసా దక్కదు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారికి పొలాలు ఉంటే వారికి కూడా రైతు భరోసా వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ పథకంపై పూర్తి విధి విధానాలు విడుదలైతే గానీ మరిన్ని విషయాలపై స్పష్టత రాదు.కేంద్ర ప్రభుత్వం రైతులకు పీఎం కిసాన్ కింద ఏడాదికి మూడు విడతల్లో రూ.6 వేలు అందిస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు కింద ఏటా రూ.10 వేలు

...మిగతాది 2 లో



# కేటీఆర్.. హరీష్ రావు.. కవిత అత్యవసర భేటీ !

**జయభేరి, హైదరాబాద్ :**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య నాయకులు మాజీ మంత్రి టి హరీష్ రావు ఎమ్మెల్సీ కవితలు అత్యవసరంగా భేటీ అయ్యారు. నందినగర్ నివాసంలో భేటీయైన కేటీఆర్, హరీష్‌రావు, కవితలు తాజా రాజకీయ పరిస్థితులు, ఫార్ములా ఈ రేసు కేసులో పరిణామాలపై చర్చించారు. ఫార్ములా ఈ రేసు కేసులో ఏసీబీ కేసును కొట్టివేయాలంటూ, తనను అరెస్టు చేయకుండా ఆదేశాలివ్వాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో వారు లీగల్ టీమ్ తో భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిపారు. క్వాష్ పిటిషన్ కొట్టివేయడం, ఈడీ విచారణకు కేటీఆర్ సమయం కోరడం ఏసీబీ విచారణకు హాజరుకావాలని ఇచ్చిన నోటీసులపై ఈ సందర్భంగా ముగ్గురు నాయకులు న్యాయవాదుల బృందంతో చర్చించారు. ఫార్ములా ఈ రేసు కేసులో తదుపరి ఏం చేయాలన్న దానిపై వారు కీలక కసరత్తులో మునిగారు. కేసులో కేటీఆర్ అరెస్టును అడ్డుకునేలా సుప్రీంకోర్టు తలుపు తట్టే ప్రతిపాదనపై కూడా యోచిస్తున్నారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలు ముగ్గురు కూడా చాల రోజుల తర్వాత అత్యవసరంగా ఒకచోట సమావేశం కావడంతో ఏం జరుతుందోనన్న ఉత్కంఠతో బీఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో నందినగర్ వద్దకు చేరుకున్నారు.

# పోలీసులకే దిక్కు లేదు



**జయభేరి, హైదరాబాద్, జనవరి 8 :**
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హోంమంత్రిగానూ దారుణంగా విఫలమయ్యారని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. రిటైర్డ్ పోలీసు ఉద్యోగి సాధిక్ అలీ తనకు రావాల్సిన బెనిఫిట్స్ కోసం 8 నెలల నుంచి ఎదురుచూస్తున్నానని, ఇక ఆత్మహత్యే శరణ్యం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు. కాంగ్రెస్ పాలన రైతులు, మహిళలు, అన్ని వర్గాలతో పాటు రిటైర్మెంట్ ఉద్యోగులకు కూడా శాపంగా మారిందన్నారు. విశ్రాంత జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఎంతో సంతోషంగా గడిపాల్సిన రోజుల్లోనూ రిటైర్డ్ ఉద్యోగులకు మానసిక క్షోభకు గురి చేయడం హేయమైన చర్యగా బీఆర్ఎస్ నేత అభివర్ణించారు.దాదాపు 7,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు వారికి హక్కుగా రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం ఏడాది నుంచి ఎదురుచూస్తున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకుంటే గాని రిటైర్మెంట్ బెనిఫిట్స్ పొందలేని దుస్థితికి రిటైర్డ్ ఉద్యోగులను నెట్టడం దారుణం. మరోవైపు నెట్వర్క్ ఆసుపత్రులకు బిల్లులు చెల్లించక ఉద్యోగులకు, జర్నలిస్టులకు, పోలీసులకు వైద్యం అందించే ఇహెచ్ఎస్, జేహెచ్ఎస్, ఆరోగ్య భద్రత పథకాలను సేవలను సైతం అటకెక్కించే పరిస్థితి కనిపిస్తోందని.. అత్యవసర వైద్య సేవలు అందకుండా చేశారని రేవంత్ రెడ్డి పాలనపై హరీష్ రావు విమర్శలు గుప్పించారు.ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి వెంటనే బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ ఉద్యోగులకు పెండింగ్ లో ఉన్న బెన్ఫిట్స్ ని వెంటనే చెల్లించాలని, ఉద్యోగులు, జర్నలిస్టులు, పోలీసులకు వైద్య సేవలు కొనసాగేలా చూడాలని బీఆర్ఎస్ తరఫున హరీష్‌రావు డిమాండ్ చేశారు. దశాబ్దాల పాటు సేవలు అందించి ఉద్యోగాలు పూర్తిచేసి, జీవితంలో విజయం సాధించిన మీ సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కావు అని హరీష్‌రావు సూచించారు. సమస్యలు ఉంటే పోరాడి పరిష్కారం చేసుకుందాం, బీఆర్ఎస్ పార్టీ అన్ని వర్గాల వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. మరోవైపు ఫార్ములా ఈ కారు రేసులో విచారణ అంశం తెలంగాణ రాజకీయాల్లో దుమారం రేపుతోంది.

# అడ్డగోలుగా ఆక్రమణలు

## ఉందిగా జాగా.. వేసేయ్ పాగా...



**జయభేరి, ఖమ్మం, జనవరి 8:**
భద్రాద్రి జిల్లాలో రెవెన్యూ వ్యవస్థ గాడి తప్పింది. జిల్లాలోని అన్ని మండలాలు, పట్టణాల్లో ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములు, చెరువులు, నాలాలు, శిఖం భూముల ఆక్రమించుకుని విచ్చలవిడిగా నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూశాఖ అధికారులు మొద్దు నిద్ర వీడట్లేదు. జిల్లా కార్యాలయంలోనే అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వచ్చి పోతున్నారంటే ఇక మారుమూల మండలాల పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరం లేదు.దీంతో ప్రతి ప్రభుత్వ శాఖలోనూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులు పేరుకుపోతున్నాయి. ఖాళీ జాగా కన్పిస్తే పాగా వేసేయ్ అన్నట్లు ఉంది జిల్లాలో పరిస్థితి. ప్రభుత్వ భూముల్లో ఆక్రమ వెంచర్లు, తప్పుడు సర్వే నంబర్లతో సీలింగ్ భూముల ఆక్రమణలు, చెరువులు నాలాలు, శిఖం భూముల పరిస్థితి దారుణంగా తయారైంది.జిల్లాలో పగలురాత్రీ తేడాలేకుండా వాగుల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. కోర్టు ఆదేశాలను సైతం అమలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయన్న విమర్శలు విన్పిస్తున్నాయి. వెంగళరావు కాలనీ సమీపంలో వందల ఎకరాల ఫారెస్టు భూమిని కేటీపీఎస్ ఉద్యోగులకు అక్రమ మార్గంలో పట్టాలు చేశారని సమాచారం.రెవెన్యూ

...మిగతాది 2 లో

# సమాజ నిర్మాణంలో బడ్జెట్ ప్రైవేట్ స్కూల్ పాత్ర ప్రశంసనీయం

- ట్రస్మా జనరల్ బాడీలో మంత్రి పొన్నం
- రాష్ట్రంలోని మొత్తం విద్యార్థుల్లో 60 శాతం మంది విద్యార్థుల భవితవ్యం ప్రైవేట్ స్కూల్స్ లోనే...
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- అండగా ఉంటామన్న ఎమ్మెల్యేలు మహిపాల్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి
- ట్రస్మా సభ భారీ సక్సెస్
- భారీ ఎత్తున తరలివచ్చిన కరస్పాండెంట్లు




**జయభేరి, పటాన్ చెరువు, జనవరి 8:**

సమాజ నిర్మాణంలో బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ పాత్ర ప్రశంసనీయమనీ, రాష్ట్రంలోని మొత్తం విద్యార్థుల్లో 60 శాతం మంది విద్యార్థులకు మంచి విద్యను అందించడం ద్వారా ఎంతో మేలు చేస్తున్నారని రాష్ట్ర, రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. బుధవారం ఎస్.వీ.ఆర్ గార్డెన్స్ లో జరిగిన ట్రస్మా రాష్ట్ర జనరల్ బాడీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభకు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీరు ఉద్యోగాలు అడుగుతలేరు... ఆర్థిక సాయం అంతకన్నా అడుగుతలేరు... స్వయం ఉపాధి పొందుతూ వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. బడ్జెట్ ప్రైవేట్ స్కూల్ సమస్యల పరిష్కారం కోసం మీతో అండగా ఉండి పరిష్కరిస్తామని చెప్పారు. దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న సమస్యల పైన సానుకూల దృక్పథంతో రాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చిస్తానని చెప్పారు. ప్రత్యేకంగా ట్రస్మా ప్రతినిధులతో సమావేశం అవుతానని భారీ ఎత్తున తరలివచ్చిన ప్రైవేట్ కరస్పాండెంట్ల హర్షధ్వానాల మధ్య మంత్రి ప్రకటించారు. మీతో అండగా ఉండడం అవసరమని మేము భావిస్తున్నాం... సమాజ నిర్మాణంలో మీ పాత్ర ప్రశంసనీయం... దీనిని ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటామని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ లోనే ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నందున ప్రధాన బాధ్యత కూడా మీ పైననే ఉన్నదని చెప్పారు. బడ్జెట్ స్కూల్స్ పేరెంట్స్ అదేవిధంగా స్కూల్స్ లో పనిచేసే ఉపాధ్యాయుల సంక్షేమం కూడా బడ్జెట్ స్కూల్స్ యాజమాన్యాలు ఎప్పటికప్పుడు వారికి అండగా ఉంటూ సహకరించాలని సూచించారు.

ట్రస్మా వేదికగా రాజకీయాలు వద్దని మంత్రి హితవు

ట్రస్మా విద్యాపరమైన అభివృద్ధి గురించి చర్చించాలి... క్వాలిటీ ఎడ్యుకేషన్ వేదికగా అనేక కార్యక్రమాలు నిర్వహించాలి. అంతేకానీ రాజకీయాల కోసం కాదని ట్రస్మాను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయాలనుకోవడం సరైనది కాదని ఆయన హితవు పలికారు. ట్రస్మాను కొంతమంది రాజకీయాల కోసం వాడుకుంటున్న విషయాన్ని ఆయన పరోక్షంగా గుర్తు చేశారు.

**సీజీపీఏ కొనసాగించాలని మంత్రికి వినతి**

పదవ తరగతి విద్యార్థుల పరీక్షలను సీజీపీఏ పద్ధతిలో నిర్వహించాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్ రమేష్ రావు, కోశాధికారి పీ. రాఘవేంద్ర రెడ్డిలు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న విధానాన్ని కొనసాగించాలని వారు కోరారు. ట్రస్మాకు లీజుకు నామ మాత్రపు అద్దెకు ఇవ్వాలనీ లేదా భవన నిర్మాణం కోసం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. ట్రస్మాకు ప్రభుత్వ గుర్తింపునిచ్చి విద్యాసంబంధ పాలసీలు రూపొందించినప్పుడు సలహాలు.. సూచనలు తీసుకోవాలని కోరారు. బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ నిబంధనలను ప్రత్యేకంగా రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్, ఇంటర్ నేషనల్ స్కూల్స్ నిబంధనలను వేరు చేయాల్సిన అవసరాన్ని వారు ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రైవేట్ స్కూల్స్ లో బడుగు బలహీన వర్గాల పిల్లలు చదువుతుంటారని కార్పొరేట్ ఇంటర్నేషనల్ స్కూల్స్ లో ధనిక వర్గానికి చెందిన పిల్లలు చదువుతుంటారని మంత్రికి వివరించారు. కొత్త స్కూల్స్ కు మాత్రమే ఎన్వోసీల విధానాన్ని అమలు చేయాలని పాత స్కూల్స్ కు అన్ని రకాల ఎన్వోసీ లను మినహాయించాలని కూడా వారు విజ్ఞప్తి చేశారు. ఎంఎస్ఎంఈలకు మాదిరిగా బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ కు రుణాలు ఇవ్వాల్సిన అవసరాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనివల్ల క్వాలిటీ ఎడ్యుకేషన్ పెరిగి బడుగు బలహీన వర్గాల పిల్లలకు మేలు జరుగుతుందని వివరించారు.

### ట్రస్మా జనరల్ బాడీ తీర్మానాలు

ట్రస్మా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి పదవులకు డిసెంబర్ 28న ఆన్లైన్ బ్యాలెట్ పద్ధతిలోఎన్నికలు జరిగాయి. బుధవారం సుమారు రెండువేల మంది ప్రతినిధులతో పటాన్చెరులో పెద్ద ఎత్తున వార్షిక జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ట్రస్మా 33 జిల్లాల ప్రతినిధులు తరలిరావడంపై సమావేశం వర్షం వ్యక్తం చేసింది. 33 జిల్లాల నుంచి వచ్చిన ప్రతినిధుల సమక్షంలో వార్షిక ప్రణాళికను కూడా ఖరారు చేశారు. కరస్పాండెంట్ల అభివృద్ధి కోసం నాయకత్వ శిక్షణ మరింతగా నిర్వహించేందుకు తీర్మానించారు. అదేవిధంగా విద్యా ప్రమాణాలు పెంచే లక్ష్యంగా అభ్యసనా సామర్థ్యాల కోసం శిక్షణలను నిరంతరం చేయాలని కూడా తీర్మానించారు. ట్రస్మా ఎలక్షన్ కమిషన్ ఇప్పటికి ఏడు జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించిందనీ, టర్మ్ అయిపోతున్న జిల్లాల వారీగా ఎన్నికలు నిర్వహించే అధికారాలను ఇస్తూ జనరల్ బాడీ తీర్మానం చేసింది. అదే విధంగా రీసెర్చ్.. ట్రైనింగ్ డెవలప్మెంట్ కమిటీని ఏర్పాటు చేయాలని, బిల్డింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, క్రమశిక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని, సభ్యత్వం డాటా అప్డేట్ చేసుకోనేందుకు 100 రూపాయలు చెల్లించి రెన్యువల్ చేసుకునే అవకాశాన్ని కూడా ఇస్తూ జనరల్ బాడీ తీర్మానించింది. బైలాస్ అమెండ్మెంట్ కమిటీ ఏర్పాటు చేయాలని, అఫీషియల్ కోఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేయాలని కూడా వారు ఈ సందర్భంగా తీర్మానించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ కమిషన్ చైర్మన్ నారాయణరెడ్డి, గౌరవ అధ్యక్షులు ఎస్ శ్రీనివాస్ రెడ్డి కొమురయ్య, సుందర్, బండి లక్ష్మణ్, నాగరాజు, కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి, గొట్టి పర్తి భాస్కర్, బండి లక్ష్మణ్, బత్తుల లక్ష్మణ్,జిల్లా నాయకులు ఉమామహేశ్వరరావు, గుల్షన్ జనార్దన్ రెడ్డి, తేజ,మాదాల సతీష్, అచ్చయ్య, రామ్మోహన్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.









**కరోనా సమయంలో రెండు సంవత్సరాలు బస్సులు**

నడుపలేదని, అందువల్ల రెండు సంవత్సరాల గ్రేస్ పీరియడ్ ఇచ్చి ఆ బస్సులు నడుపుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. అదేవిధంగా స్క్రాప్ చేసే విధానం తెలియకపోవడం వల్ల కొంతమంది కరస్పాండెంట్లు రవాణా శాఖ నిబంధనల మేరకు స్క్రాప్ చేయకుండా అమ్మేసుకున్నారని వారికి మరొక అవకాశం ఇచ్చి రవాణా శాఖ నిబంధనల మేరకు స్క్రాప్ చేసుకునే అవకాశాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**ట్రస్మాకు అండగా ఉంటాం:**

ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి లు మాట్లాడుతూ ట్రస్మాకు తాము అండగా ఉంటామని ప్రకటించారు. ట్రస్మా చేస్తున్న వినూత్న కార్యక్రమాలు మేము ఎప్పుడూ గమనిస్తున్నామని చెప్పారు. దిగువ మధ్య తరగతి మరియు మధ్య తరగతి వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తున్న ప్రైవేట్ స్కూల్స్కు అండగా ఉంటామని చెప్పారు. విద్యా వికాసం కోసం పాటుపడుతున్న బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ కోసం తాము అండగా ఉంటామని చెప్పారు.

**ట్రస్మా స్కూల్స్ అభివృద్ధి కోసం వార్షిక ప్రణాళికల మేరకు ముందుకు సాగుతాం:**
**ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్**

బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ అభివృద్ధి కోసం వార్షిక ప్రణాళికల మేరకు నిరంతరం పనిచేస్తామని... విద్యార్థుల బోధన సామర్థ్యాలను మెరుగుపరచడమే ధ్యేయంగా ముందుకు సాగుతామని రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్ చెప్పారు. ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాలను పెంచడం ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాల క్వాలిటీని పెంచడం కోసం ఇప్పటివరకు 25వేల మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామని ఇది నిరంతరం కొనసాగుతుందని ప్రకటించారు. విద్యా రంగంలో వచ్చే నూతన పోకడలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులకు అందజేస్తూ టెక్నాలజీని అనుసంధానం చేసే విధంగా కార్పొరేట్ విద్యాసంస్థలను తలదన్నే రీతిలో బోధన కొనసాగేందుకు తాము కృషి చేస్తామని చెప్పారు. అదేవిధంగా బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ పరిరక్షణ ధ్యేయంగా ముందుకు సాగుతామన్నారు. విద్యా ప్రమాణాలను పెంచి దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నెంబర్ వన్ గా ఉండే ప్రయత్నిస్తామని చెప్పారు.



## ఫర్నీచర్ షాప్ నీ ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే

**జయభేరి, ఉప్పల్ :**

మల్లాపూర్ నెహ్రూ నగర్ కేబుల్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన నీమన్ ఫర్నీచర్ నీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు వ్యాపార రంగంలో రాణించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, HB Colony డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గౌతమ్ IAS అధ్యక్షతన జరిగిన దిశ కమిటీ మీటింగ్ లో దిశ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ సహచర ఎమ్మెల్యేతో కలిసి పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.

## మైనంపల్లి జన్మదిన వేడుకలు

- ఘనంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన వేడుకలు



**జయభేరి, గజ్వేల్, జనవరి 08 :**

మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పుట్టినరోజు వేడుకలు గజ్వేల్ పట్టణంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్,అనూప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. గజ్వేల్ పట్టణంలోని ఇందిరా గాంధీ చౌరస్తా దగ్గర ఇంద్రగాంధీ విగ్రహానికి పూలమాలవేసిన అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేసి తన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కు గాడిపల్లి అనూప్ పూలమాలవేసి వేద పండితులు ఆశీర్వదించిన అనంతరం కేక్ కటింగ్ నిర్వహించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ లోని కార్మికులకు సన్మానాలు నిర్వహించి, దుస్తువులు అందించారు. జన్మదినం సందర్భంగా పేద ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

## జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో కంటి పరీక్షలు

- సర్వేంద్రియానాం నయనం ప్రధానం



**జయభేరి, వర్గల్, జనవరి 08 :**

మహాత్మ జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాల వర్గల్ లో నేడు గజ్వేల్ కంటి ఆసుపత్రి లోక్ నేత్ర ట్రస్ట్ నుంచి కంటి వైద్య నిపుణులు విచ్చేసి నేత్ర పరీక్షలు నిర్వహించారు. వీరు సేవా దృక్పథంతో ముందుకు వచ్చి 300కు పైగా విద్యార్థినులకు, కళాశాల అధ్యాపకులకు ఉచితంగా కంటి పరీక్షలు చేసి తలనొప్పి, కళ్ళు మంట, పార్శ్వపు నొప్పి, కళ్లలో నీరుకారడం మొదలగు సమస్యలను గుర్తించి తగిన సూచనలు అందించారు. విద్యార్థినులకు, వారి కుటుంబ సభ్యులకు తగ్గింపు ధర తొ కంటి పరీక్షలు నిర్వహిస్తామని కంటి వైద్య నిపుణులు డాక్టర్ సత్యనారాయణ, వై పరశురాం (DOA), ఆర్ సంజీవ్ (ఐ బ్యాంకు టెక్నీషియన్) పేర్కొన్నారు. ఇందుకుగాను కళాశాల యాజమాన్యము, విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రధాన అధ్యాపకులు డాక్టర్ గడ్డం భాస్కరరావు, హెల్త్ సూపర్వైజర్ ఉమా రాణి, అసిస్టెంట్ సూపర్వైజర్ సౌజన్య నేతత్వంలో జరిగింది.

## కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ఎపి మంత్రి భేటీ

**జయభేరి, న్యూఢిల్లీ:**

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంత్రి రాం ప్రసాద్ రెడ్డి భేటీ అయ్యారు. పలు అంశాలను కేంద్రం దృష్టి కి తీసుకెళ్లి పరిష్కారానికి సహకారం కోరారు. సుమారు 45 నిమిషాలు రవాణా అంశాలపై కేంద్ర మంత్రితో రాంప్రసాద్ రెడ్డి సుదీర్ఘ చర్చ జరిపారు. కడప నుండి రాయచోటి వరకు 4 లేన్ల రహదారిని మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజంపేట రాయచోటి కదిరి రహదారి రాష్ట్ర రహదారి నుండి జాతీయ రహదారి జాతీయ రహదారిగా మెరుగుపరచండి. రాయచోటిలో రోడ్ల విస్తరణ గ్రామాలు, మండల కేంద్రాలు, జిల్లా హెడ్ క్వార్టర్స్ మధ్య మెరుగైన కనెక్టివిటీని సులభతరం చేసేందుకు సెంట్రల్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ నిధుల ద్వారా పనులకు అనుమతులు కోరారు.



## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ

**జయభేరి, గజ్వేల్, జనవరి 08 :**

గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో అల్పాహార పంపిణీ కార్యక్రమం బుధవారం 192వ రోజుకు చేరుకుంది ఈ సందర్భంగా లయన్ నంగునూరి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ రిజియర్ చైర్మన్ గోలి సంతోష్, లయన్ ఎన్ సీ సంతోష్, లయన్ మల్లేశం గౌడ్ మాట్లాడుతూ.. మానవసేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో ప్రభుత్వ దవాఖాన వద్ద ప్రతిరోజు ఉదయం అల్పాహారం పంపిణీ చేయడం జరుగుతుందని అందులో భాగంగా లయన్ నేతి శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా అల్పాహారంతో పాటు అరటిపండ్లు బ్రెడ్ పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, ఫ్రెండ్స్ ఫర్ యు అసోసియేషన్ సభ్యులు, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం

**జయభేరి, మేడిపల్లి :**




రాచకొండ పోలీస్ కమిషనరేట్ ,మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నీల్ గోటే ఇంజనీరింగ్ కాలేజ్ (NGIT) లో మేడిపల్లి పోలీస్ వారి ఆధ్వర్యంలో నార్కోటిక్స్ డిపార్ట్మెంట్ (TGNAB) మరియు షీ టీమ్స్ (SHE) సంయుక్తంగా విద్యార్థినీ విద్యార్థులకు డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన మల్కాజ్గిరి ఏసిపి ఎస్ చక్రపాణి మాట్లాడుతూ.. డ్రగ్స్ మహమ్మారి విద్యార్థుల జీవితాన్ని, కుటుంబాలను నాశనం చేస్తుందని, ఎట్టి పరిస్థితుల్లో డ్రగ్స్ జోలికి వెళ్ల కూడదని, విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ఎప్పటికప్పుడు టెక్నాలజీని వినియోగించుకుని సాంకేతికతను అందుపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, చెడు వ్యసనాలకు బానిస కావద్దని, లెక్చరర్స్ పట్ల, పెద్దల పట్ల గౌరవంగా ఉండాలని, అదేవిధంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ నేరాలకు ముఖ్య కారణం ఒకటి అత్యాశ రెండు అమాయకత్వం ఈ రెండు కారణాలవల్ల సైబర్ నేరాలు జరుగుతాయని ఏదైనా సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే Dial1930 కు కాల్ చేయాలని సూచించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న నార్కోటిక్స్ ఏసీపీ రమేష్ మాట్లాడుతూ.. డ్రగ్స్ మత్తులో యువత బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటుందని, డ్రగ్స్ జోలికి వెళ్లకూడదని చట్టాలు కఠినంగా ఉన్నాయని, డ్రగ్స్ కు సంబంధించి ఎలాంటి ముందస్తు సమాచారం ఉన్నవెంటనే TGNAB తెలంగాణ వారికి సమాచారం అందించాలని చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఇన్స్పెక్టర్ ఆర్ గోవిందరెడ్డి విద్యార్థిని విద్యార్థుల సూచనలు చేస్తూ సమాజంలో మహిళల పట్ల చిన్న పిల్లల పట్ల జరిగే నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, విద్యార్థినీ విద్యార్థులకు మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపకూడదని, చిన్న నిర్లక్ష్యం వల్ల చాలామంది విద్యార్థులు రోడ్డు ప్రమాదం బారిన పడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని మరి ఎంతోమంది అంగవైకల్యం చెంది అవయవాలు కోల్పోయి సమాజంలో నరకం అనుభవిస్తున్నారని హెచ్చరించారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో రాచకుండా షీ టీమ్స్ ఏఎస్ఐ పద్మ మాట్లాడుతూ.. చిన్నపిల్లలు, మహిళల కోసం షీ టీమ్స్ అద్భుతంగా పనిచేస్తున్నాయని ఏదైనా సమాచారం ఉంటే ఎవరైనా వేధించినట్లయితే వెంటనే షీటీమ్స్ వారికి సమాచారం అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని వేధించిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో NGIT కళాశాల ప్రిన్సిపల్ శ్యామ్ సుందర్, నార్కోటిక్ ఇన్స్పెక్టర్లు, ప్రవీణ్, రాంప్రసాద్, దాదాపు విద్యార్థినీ విద్యార్థులు 500 మంది పాల్గొన్నారు.




# యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి
- మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి, ఎంపి కావ్య

**జయభేరి, హన్మకొండ, జనవరి 08:**




గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం పట్ల కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. నెహ్రూ యువ కేంద్ర వరంగల్ వారి ఆధ్వర్యంలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో తెలంగాణ గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణ పై బొల్లికుంట లోని వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం, సరఫరా, అక్రమ రవాణా, విక్రయం నివారణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుంది అని అన్నారు. ఈ చర్యల యొక్క ముఖ్య ఉద్దేశం ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, నేర ప్రవర్తనలను అరికట్టడం, యువతను పదార్థాల వలన కలిగే ప్రమాదాల నుంచి కాపాడడం అని తెలిపారు.
గంజాయి, నార్కొటిక్ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణగా కు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.
గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, వినియోగంపై నిఘా ఉంచి సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు చేపట్టాలన్నారు. యువత గుట్కా, మత్తు పదార్థాలకు అలవాటు పడితే ప్రమాదకరమైన రోగాల బారిన పడి ప్రాణాలకే ప్రమాదమని, తద్వారా కుటుంబాలు రోడ్డు బారిన పడుతాయని అన్నారు.



## మైనంపల్లి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన శ్రీనివాస్ గుప్తా

**జయభేరి, గజ్వేల్, జనవరి 08 :**

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కు పుట్టిన రోజు సందర్భంగా ములుగు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కళ్ళకల్ లో కలిసి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్, సమీర్ ఈర్షాద్, గొల్లపల్లి శేఖర్, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


## అజ్మీర్ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న కో ఆప్షన్ దంపతులు



**జయభేరి, పరకాల, జనవరి 08:**

రాజస్తాన్ రాష్ట్రంలోని ప్రముఖ సూఫీ మత గురువు హజ్రత్ సయ్యద్ ఖాజా మొయినుద్దీన్ చిస్తీ 813 వ ఉర్సు ఉత్సవాల్లో భాగంగా దర్గాను దర్శించుకున్న పరకాల మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ముఫీనా ఫాతిమా హమీద్ దంపతులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్టు తెలిపారు.

## విద్యుత్ సరఫరాకు అంతరాయం



**జయభేరి, పరవాడ:**

మండల కేంద్రం అయ్యిన పరవాడలో ఉన్న సబ్ స్టేషన్ 33కేవీ ఫీడర్ల,8 ఎంవీఏ ఏరక్షన్ పనులుకు గాను గురువారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంట వరకు పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏపీఇపిడిసిఎల్ కశింకోట డివిజన్ ఈ ఈ ఎస్ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలియజేసారు. మండల కేంద్రం అయ్యిన పరవాడ, వెన్నలపాలెం, బొడ్డపువానిపాలెం, రావాడ, భరణికం, స్వవంభూవరంలో గొర్లివానిపాలెం, పి ఎస్ బోనంగి, గొల్లపాలెం, కలపాక, ఈ పి బోనంగి, దేశపాత్రునిపాలెం,ఈవీపీ బోనంగి గ్రామాలకు తెలిపిన సమయంలో విద్యుత్ అంతరాయం కల్గుతుందని వినియోగదారులు అందరూ అంతరాయన్ని గమనించగలరని అని ప్రకటనలో తెలియజేసారు.

## అంతర్ జిల్లాల జూనియర్ అర్చరీ కోరకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ నందు ఎంపికలు




**జయభేరి, పరవాడ:**

ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల జూనియర్ ఆర్చరీ చాంపియన్ షిప్ రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో పాల్గొనుటకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఆర్చర్లను ఎంపిక ఈ నెల 10 వ తేదీన సంస్కృతి గ్లోబల్ స్కూల్ నందు జరుగును అని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఆర్చరీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె. నిశాంత్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు 10012025 తేదీ ఉదయం 9 గంటలకు సంస్కృతి గ్లోబల్ స్కూల్ ఆర్చరీ గ్రౌండ్ నందు హాజరు కావలని, ప్రతి ఆర్చర్ ఫోటో, ఆధార్ కార్డు, జనన ధ్రువపత్రం తీసుకోని రావలెనని తెలిపారు.

## త్వరలో జీపీ కారోబార్ సిబ్బంది మహాసభ

**జయభేరి, హైదరాబాద్:**

రాష్ట్ర కోర్ కమిటీ నిర్ణయం మేరకు 20వేల మందితో రాష్ట్ర గ్రామపంచాయతీ సిబ్బంది కలిసి హైదరాబాదులో త్వరలో మహాసభ నిర్వహించబోతున్నట్టు తెలంగాణ స్టేట్ గ్రామపంచాయతీ కారోబార్ అండ్ సిబ్బంది అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ తెలిపారు. దీనికి పెద్దఎత్తున సిబ్బంది తరలి రావాలని ఆయన కోరారు. మన బలం బలగం చూసి మన జీవితాలతో ఆటలాడుకున్న వారికి గుణపాఠం నిలవాలని పిలుపునిచ్చారు.

# ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- పాఠశాల అదనపు గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

**జయభేరి, పరకాల, జనవరి 08:**



బుధవారం గ్రేటర్ వరంగల్ 17వ డివిజన్ బొల్లికుంటలోని జెడ్ పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల నందు అదనపు గదులను వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి లు కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నాయని అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధన చేయిస్తున్నారని, దానికి తోడు రుచికరమైన మధ్యాహ్న భోజనం, అల్పాహారం, ఉచితదుస్తులు, పుస్తకాలు, తదితర వసతులు కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యనందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.
పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న సద్గురు సేవ సంస్థ సభ్యులని ఎమ్మెల్యే అభినందించారు. అన్ని కులాల పేద విద్యార్థులకు మెరుగైన వైద్య కల్పనే లక్ష్యంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ లో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కలిగిస్తుందన్నారు.
పేద విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా నాణ్యమైన విద్యను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, పాఠశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోలేదని, బిఆర్ఎస్ నాయకులు కావాలనే గురుకుల పాఠశాలపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు.



## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం యూత్ అధ్యక్షుడిగా కొమ్ముల శివ

**జయభేరి, శాయంపేట :**

శాయంపేట మండల కేంద్రంలో టి యు ఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో కన్వీనర్ పొడి శెట్టి గణేష్ ఆధ్వర్యంలో నిన్న జరిగినటువంటి ఉద్యమకారుల సమావేశంలో టియుఎఫ్ చైర్మన్ చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు టియుఎఫ్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు నందగిరి రజనీకాంత్, టియుఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల సాంబారావు ఏకగ్రీవంగా టియుఎఫ్ హన్మకొండ జిల్లా యూత్ అధ్యక్షుడిగా కొమ్ముల శివను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టియుఎఫ్ జిల్లా యూత్ అధ్యక్షుడు కొమ్ముల శివ మాట్లాడుతూ.. తన నియమకానికి సహకరించిన వరంగల్ జిల్లా కో కన్వీనర్ పొడి శెట్టి గణేష్, వరంగల్ జిల్లా కన్వీనర్ నందగిరి రజనీకాంత్, ఆకుల సాంబారావు, టి యుఎఫ్ మండల అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి రవీందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టియుఎఫ్ హనుమకొండ జిల్లాలో బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఉద్యమకారుల కొరకు ఏదైతే కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిందో ఉద్యమకారులకు 250 గజాల ఇట్టి స్థలం, ఇల్లు కట్టిస్తాం అనడం గౌరవ వేతనం 25000 జార్ఖండ్ తరహాలో సాధించే దిశగా కృషి చేస్తానని తెలిపారు.

# సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం

- లక్ష్మాపూర్ లో సహకార సంఘం నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి

**జనవరి 9:**



సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామ పరిధిలో నాబార్డ్ నిధుల కింద రూ.94 లక్షల 25 వేలతో నిర్మించిన రైతు వ్యవసాయ సహకార సంఘం నూతన భవనాన్ని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి కృషి చేసిన శామీర్ పేట్ సొసైటీ చైర్మన్ మధుకర్ రెడ్డి తో పాటు పాలకమండలిని అభినందించారు. రైతులు సొసైటీ ద్వారా వచ్చే లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలని, సొసైటీ అంటేనే రైతుల ఆస్తులని అన్నారు. రైతులు ఇళ్లు కట్టుకోవాలన్నా, భూమి కొనుగోలు చేయాలన్నా, వారి పిల్లల చదువులకు కూడా సొసైటీ ద్వారా రైతులు సబ్సిడీలో లోన్లు తీసుకోవచ్చన్నారు. అప్పులో ఉన్న సొసైటీని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, పాలకమండలి కృషితో రూ. 60 లక్షల వరకు లాభాల్లోకి తీసుకురావడం గొప్ప విషయమన్నారు. సొసైటీ ద్వారా వచ్చే స్కీముల గురించి రైతలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, ఏఎంసీ చైర్మన్ నర్సింహులు. శామీర్ పేట సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య, డైరెక్టర్లు భూమిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి. బిక్షపతి. బావుసింగ్, లక్ష్మీనర్సింలు, విష్ణు, సుదర్శన్, చంద్రకళ మాజీ సర్పంచులు ఆంజనేయులు. రవి, హరమోహన్ రెడ్డి, కృపాకర్ మాజీ ఎంపీపీ హారికమురళీగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి. నాయకులు నర్సింలు, జగన్నాదం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## న్యూ ప్రెస్ క్లబ్ సభ్యునికి ఆర్థిక సాయం



**జయభేరి, పరవాడ:**

న్యూ ప్రెస్ క్లబ్ సభ్యుడు పరవాడ ఆంధ్ర ఫోకస్ రిపోర్టర్ ద్వారపూడి శ్రీనివాసరావు తండ్రి ద్వారపూడి అప్పారావు ఇటీవల ఆరోగ్యం క్షిణిచి మరణించిన సంగతి తెలిసిందే.బుధవారం ఆయన పెద్ద కర్మ సందర్భంగా పరవాడ న్యూ ప్రెస్ క్లబ్ మిత్రబృందం కొంత మేరకు నగదును సమకూర్చి ఆయన కుమారుడైన ద్వారపూడి శ్రీనివాసరావుకు యూనియన్ అధ్యక్షులు లాలం కృష్ణారావు చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు కృష్ణారావు మాట్లాడుతూ న్యూ ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం తీసుకున్న ఏ ఒక్క మిత్రుడి కైనా కష్టకాలంలో యూనియన్ చేదోడుగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ యొక్క కార్యక్రమంలో సెక్రెటరీ న్యూ ప్రెస్ క్లబ్ పిఎస్ నాయుడు, గౌరవ అధ్యక్షులు పరవాడ జగదీశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ పైలప్రసాద్ , జాయింట్ సెక్రెటరీ కసిరెడ్డి రాజు, సభ్యులు బండారు శరన్ కుమార్,చుక్క రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


# ప్రభుత్వ ఆసుపత్రి అందించే సేవలు ఎట్లా ఉన్నాయి..!

- జాతీయ సెమినార్లో భాగంగా ఫీల్డ్ విజిట్

**జయభేరి, గజ్వేల్, జనవరి 08 :**



కేంద్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అసాంక్రమిక వ్యాధుల పై హైదరాబాద్ లో జరుగుతున్న జాతీయ సెమినార్లో భాగంగా ఫీల్డ్ విజిట్ లో సిద్దిపేట జిల్లాలో జరుగుతున్న అసంక్రమిత వ్యాధులకు అందుతున్న వైద్య సేవలను పార్థసారథి సేన్ శర్మ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఉత్తరప్రదేశ్, ఆర్.వి కర్నన్ కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ తెలంగాణ, ఆరాధన పట్నాయక్ మేనేజింగ్ డైరెక్టర్ మినిస్టర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్, విజయ్ దయరామ్ మేనేజింగ్ డైరెక్టర్ నేషనల్ హెల్త్ మిషన్ చతిస్గఢ్ ,డాక్టర్ భారతి దీక్షిత్ మేనేజింగ్ డైరెక్టర్ నేషనల్ హెల్త్ మిషన్ రాజస్థాన్, ఇంద్రాణి కౌశల్ సీనియర్ ఈ ఏ మినిస్టర్ ఆఫ్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ ,డాక్టర్ అకౌసరహి మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ హెచ్ఎం నాగాలాండ్ వివిధ రాష్ట్రాలకు చెందిన, ఎన్సీడీ కార్యక్రమ అధికారులు సిద్ధిపేటలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో ఎన్ సి డి సెంటర్ ను తెలంగాణ డయాగ్నొస్టిక్ హబ్, డయాలసిస్ సెంటర్, ములుగు, మర్కుక్, కుకునూరుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు మామిడియాల, నెమటూర్, ఎర్రవల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లను, బస్తీదవాఖాన, కాలకుంట కాలనీ, పట్టణ ఆరోగ్య కేంద్రం నాసరపుర సందర్శించారు. అక్కడ జరుగుతున్న అసంక్రమిక వ్యాధుల సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి వారి సమస్యలను, వారికి లభిస్తున్న సేవలను అడిగి తెలుసుకుని వారికి అందిస్తున్న వైద్య సేవల వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో ఆరోగ్య శాఖ అధికారుల బృందంతో కలిసి పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి జిల్లాలో అసంక్రమిక వ్యాధుల వైద్య సేవలకొరకు ప్రభుత్వం కల్పించిన వైద్య సౌకర్యాలను మరియు వైద్య సేవల వివరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పల్వాన్ కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల డైరెక్టర్ విమల తామస్, గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ శాంతి వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# హరీష్ రావుకు పార్టీ బాధ్యతలు



✍ జయభేరి, హైదరాబాద్, జనవరి 8:

ఫార్ములా ఈ కారు రేసు కేసులో ఒక స్పష్టత అయితే వచ్చింది. ఈ కేసుకు సంబంధించి కేటీఆర్ అరెస్ట్ ఖాయమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. ఏసీబీ అరెస్ట్ చేస్తే బయటకు బెయిల్ పై వచ్చేందుకు ఎంత సమయం పడుతుందో కూడా తెలియదు. దీంతో న్యాయనిపుణులతో న్యాయపరమైన అంశాలు మాత్రమే చర్చించిన కేటీఆర్ పార్టీ కార్యక్రమాలను ఎవరు తీసుకెళతారన్న దానిపై కూడా గులాబీ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. నందినగర్ లోని కేటీఆర్ నివాసం నుంచే ఎర్రవెల్లి ఫాం హౌస్ లో ఉన్న కేసీఆర్ తో కూడా ఈ విషయాలను చర్చించినట్లు తెలిసింది. కేటీఆర్ అరెస్ట్ తర్వాత ఎవరి నాయకత్వంలో పార్టీ పనిచేయాలన్న దానిపై కూడా సమాలోచనలు జరిపారు. అయితే కొందరు ఈ సమావేశంలో కల్వకుంట్ల కవిత పేరు చెప్పారని తెలిసింది. అయితే కేసీఆర్ ఇందుకు అంగీకరించలేదని అంటున్నారు. కవితకు పార్టీ పగ్గాలు తాత్కాలికంగానైనా అప్పగించేందుకు కేసీఆర్ సుముఖత వ్యక్తం చేయలేదని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. హరీశ్ రావు విషయంలోనూ ఆయన అంత సుముఖంగా లేరని చెబుతున్నారు. కవిత, హరీశ్ రావుల పేర్లు కేటీఆర్ జైలుకు వెళ్లిన తర్వాత పార్టీ కార్యక్రమాలను చేపడితే బాగుంటుందన్న సూచనలను కూడా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తోసిపుచ్చినట్లు చెబుతున్నారు. కేటీఆర్ లేని సమయంలో పార్టీ కార్యక్రమాలను ఎవరు పర్యవేక్షించాలన్న దానిపై తాను నిర్ణయం తీసుకుంటానని కేసీఆర్ నేతలకు చెప్పినట్లు తెలిసింది.కానీ నేతలు చెబుతున్న సమాచారం మేరకు కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగుతారని చెబుతున్నారు. మరొకరికి పార్టీ పగ్గాలు అప్పగించడం కంటే తానే బయటకు వచ్చి పార్టీ కార్యక్రమాలకు పిలుపునివ్వడం మంచిదన్న యోచనలో కేసీఆర్ ఉన్నారని అంటున్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తి కావడంతో తాను ఇకబయటకు రాక తప్పదని కూడా కేసీఆర్ సన్నిహితుల వద్ద వ్యాఖ్యానించినట్లు తెలిసింది. తానే వచ్చి రాష్ట్ర వ్యాప్త పర్యటన చేసి రాష్ట్రంలో వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. కేటీఆర్ అరెస్ట్ అయిన వెంటనే ఎర్రవెల్లి ఫాం హౌస్ నుంచి కేసీఆర్ బయటకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారని, రాష్ట్ర వ్యాప్త పర్యటనకు ముందు మీడియా సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వ వైఫల్యాలను కూడా ఎండగట్టేందుకు ఆయన రెడీ అవుతున్నట్లు గులాబీ పార్టీ వర్గాలు వెల్లడించాయి.

### రిస్క్ తీసుకుంటున్న కేటీఆర్

ఫార్ములా ఈ రేసు కేసులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ ను హైకోర్టు కట్టివేసింది. అరెస్టు నుంచి కల్పించిన రక్షణ కూడా ఎత్తి వేసింది. ఉదంయ తీర్పు రాగానే సాయంత్రం అలా కేటీఆర్ కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఆయన న్యాయపోరాటం ఆయనకు రిస్క్‌గా మారుతుందని.. ధైర్యంగా నిలబడి విచారణ ఎదుర్కొంటే ప్రజల నుంచి సానుభూతి అయినా వస్తుందన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో ఉంది. ఇప్పుడు సుప్రీంలోనూ ఊరట లభించకపోతే అన్ని న్యాయపరమైన అవకాశాలను కోల్పోవడంతో పాటు కేసులో ఏదో ఉందని అందుకే ఆయనకు రిలీఫ్ దక్కలేదని ప్రజల్లో ప్రచారం జరిగే అవకాశం ఉంది. ఫార్ములా ఈ రేసు కేసులో ఎలాంటి అవినీతి లేదని కేటీఆర్ గట్టిగా వాదిస్తున్నారు. ఇందులో పస లేదని లొట్టపీసు కేసు అని హైకోర్టు క్వాష్ పిటిషన్ కొట్టివేసిన తర్వాత కూడా వ్యాఖ్యానించారు. అందుకే ఆయన న్యాయపోరాటానికి మొగ్గు చూపారు. ఈ క్రమంలో ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అయితే సుప్రీంకోర్టు వరకూ వెళ్లడం ఎందుకని తప్పు చేయనప్పుడు ఎందుకు అలా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. నిజాయితీ పరుడు అయితే నిరూపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎద్దేవా చేస్తోంది. అయితే రాజ్యాంగపరమైన అన్ని అవకాశాలను వినియోగించుకునే హక్కు తనకు ఉందని.. అందుకే సుప్రీంకోర్టుకు పోయామని న్యాయపోరాటం చేస్తున్నామని కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. ఏసీబీ లేదా ఈడీ ఎలాంటి దూకుడు చర్యలు తీసుకున్నా కేటీఆర్ కు రాజకీయంగా ప్లస్ అవుతుందనే అంచనాలు ఉన్నాయి. అరెస్టులు చేయడం వల్ల రాజకీయంగా ఆయనకు సానుభూతి వస్తుంది తప్ప దాని వల్ల ఉపయోగం ఏమీ ఉండదని ఇప్పటి వరకూ జరిగిన రాజకీయాలతో ఎవరికైనా అర్థం అవుతుందని కాంగ్రెస్ నేతలూ బహిరంగంగానే చెబుతున్నారు. అదే కక్ష సాధింపులు అనే భావన ప్రజలకు రాకుండా న్యాయపరమైన అన్ని అవకాశాలనూ వినియోగించుకున్న తర్వాత అరెస్టు చేస్తే కేటీఆర్ తప్పు చేసినందునే న్యాయవ్యవస్థ రిలీఫ్ ఇవ్వలేదన్న అభిప్రాయం ప్రజల్లోకి వెళ్తుంది. అప్పుడు అరెస్టు చేసినా రియాక్షన్ రాదని అనుకుంటూ ఉండవచ్చు. అందుకే అరెస్టు చేయకుండా కేటీఆర్ కు అన్ని న్యాయపరమైన అవకాశాలను కల్పిస్తున్నారని భావిస్తున్నారు. పిటిషన్ వేయడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవు కానీ రాజకీయంగా ఎలాంటి పరిణామాలు వస్తాయన్నదానిపైనే కేటీఆర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఏసీబీ సుప్రీంకోర్టులో కేవియట్ వేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఏసీబీ అధికారులు గ్రీన్ కో తో పాటు సబ్సిడరీ కంపెనీల్లో సోదాలు ప్రారంభించారు. ఈ కేసులో ఏ టుగా ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ త్రీగా ఉన్న హెచ్ఎండీఏ మాజీ ఉన్నతాధికారి బీఎల్ఎన్ రెడ్డిలకు కూడా ఈడీ నోటీసులు జారీ చేసింది. వారు కూడా విచారణకు హాజరు కాలేదు. తమకు సమయం కావాలని కోరారు. దాంతో వారికీ మరోసారి ఈడీ నోటీసులు జారీ చేసింది. వారిని ప్రశ్నించిన తర్వాతనే కేటీఆర్ ను ప్రశ్నించాలని ఈడీ అనుకుంటున్నట్లుగా తెలుస్తోంది. విచారణలకు అయితే హాజరవుతారు కానీ.. ఏసీబీ కానీ ఈడీ కానీ సుప్రీంకోర్టులో పిటిషన్ తేలే వరకూ చర్యలు తీసుకోకపోవచ్చన్న వాదన వినిపిస్తోంది.



## ప్రధాని మోడీ మంత్రి సంజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం

■ నిధుల మంజూరు పై హర్షం

✍ జయభేరి, సైదాపూర్ :

సైదాపూర్ మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు హోం శాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి కిసాన్ నిది సంవత్సరానికి 6000 ఇచ్చేది ఇప్పుడు పదివేలకు పెంచారు అలాగే సైదాపూర్ మండల ప్రతి గ్రామానికి మన కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ ప్రతి గ్రామానికి 4 లక్షల రూపాయలు కేటాయించినారు వారికిపాలాభిషేకం చేయడం జరిగింది బిజెపి నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వచ్చినందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కేంద్రం నుంచి అధిక నిధులు వస్తాయని వారు ఆనంద వ్యక్తీ చేశారు ఈ కార్యక్రమంలో ఓబిసి మండల ప్రెసిడెంట్ నెల్లి శ్రీనివాస్ మండల ఉపాధ్యక్షులు భాష వేణి సంపత్ నీర్ల సతీషు గోడిశాల కిరణ్ నెల్లి శ్రీకాంత్ నాగరాజు శ్రీనివాసు రాజు బిక్షపతి బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## శిశు సంరక్షణసంస్థల్లోని పిల్లలకు ధృవీకరణ పత్రాల పంపిణీ

■ పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్

✍ జయభేరి, హైదరాబాద్:

శిశు సంరక్షణ సంస్థలలో ఆశ్రయం పొందుతున్న పిల్లలకు హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధ్రువీకరణ (సర్టిఫికెట్లను) పత్రాలను రవాణా, బీసీ సంక్షేమ శాఖ హైదరాబాద్ ఇన్చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పంపిణీ చేసారు. 50 శిశు సంరక్షణ కేంద్రాల్లో 2300 మందికి పైగా పిల్లలు ఉన్నారు. ఈరోజు 1330 మందికి వివిధ రకాల సర్టిఫికెట్ లు ఇవ్వడం జరిగింది.. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కార్పొరేటర్ విజయారెడ్డి , యూనిసెఫ్ ప్రతినిదులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ... హైదరాబాద్ శిశుకేంద్రాల్లో సంరక్షణ పొందుతున్న 1330 మందికి పైగా వివిధ రకాల గుర్తింపు , విద్యాపరమైన ,వారి కుల ,నివాస , ఆధార్ తదితర సర్టిఫికెట్ ఇచ్చే కార్యక్రమం చేపట్టడం జరిగింది. జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులకు అభినందనలు. సర్టిఫికెట్ పొందుతున్న వారికి భవిష్యత్ లో అంతా మంచే జరగాలని జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కుంటున్న మీకు ప్రభుత్వం అండగా ఉంటుంది. భవిష్యత్ కార్యక్రమాల్లో కూడా ఉపాధి ఇతర రంగాల్లో కూడా ప్రభుత్వ సహకారం ఉంటుంది. ఇప్పుడున్న 50 శిశు విహార్ కేంద్రాల్లో 6 ప్రభుత్వం నడుపుతుంది. మిగతావాటికి కూడా ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుంది. ఇలాంటి ప్రక్రియ దేశంలో ఎక్కడ జరగడం లేదు. హైదరాబాద్ కాకుండా కాస్మోపాలిటన్ సిటీ అన్ని రకాల ప్రాంత ప్రజలు ఇక్కడ ఉంటారు. ఇటువంటి వ్యవస్థలో ఉన్న వారికి ఆధారాలు ఉండలని జిల్లా యంత్రాంగం ప్రతిష్టగా తీసుకుందని అన్నారు. గుర్తింపు మనిషి ఐడెంటిటీ మనం భవిష్యత్ లో బయటకు వెళ్ళినప్పుడు ఇది చాలా అవసరం. ఆ సర్టిఫికెట్ ద్వారా మీకు వచ్చే కోటాలో అవకాశాలను వినియోగించుకోవాలని కోరుతున్నా. మీరు మంచిగా చదువుకొని కాంపిటేటివ్ స్పిరిట్ లో ముందుకు పోవాలి. ప్రభుత్వం అండగా ఉంటుంది. సమాజంలో నాకెందుకు అనుకోకూడదు. రోడ్డు భద్రతా మాసోత్సవాలు జరుగుతున్నాయి.. రోడ్డు భద్రత పై అవగాహన కల్పిస్తున్నాయి. అర్ఫాన్స్ విషయంలో ప్రజా పాలన ప్రభుత్వం మంత్రులు అధికారులు సానుకూలంగా ఉందని అన్నారు.

## ఫుడ్ ఫెస్టివల్ లో తీరొక్క రుచులు

■ ఎంఈఓ మాధవరెడ్డి

✍ జయభేరి, జగదేవపూర్, జనవరి 08 :



ఫుడ్ ఫెస్టివల్ తో పోషకాహారం ఉంటుందని, చిరుధాన్యాలతో ఆరోగ్యమని ఎంఈఓ మాధవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం జగదేవపూర్ మండలంలో తిగుల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తయారు చేసుకుని వచ్చిన వంటకాలను, పండ్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో తల్లిదండ్రుల తో సమావేశంలో భాగంగా తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. పోషకాహారంలో విటమిన్లు ఉంటాయని,సంపూర్ణ ఆరోగ్యానికి దోహదపడుతాయన్నారు.

ఫుడ్ ఫెస్టివల్ వల్ల పౌష్టికాహారం పట్ల అవగాహన కలుగుతుందని తెలిపారు. సర్వపిండి, జొన్న రొట్టే, చిరుధాన్యాలతో తయారు చేసి తీసుకవచ్చిన విద్యార్థులను, తల్లిదండ్రులను ప్రత్యేకంగా అభినందించారు. పోషకాహారం తీసుకోవడంతో విద్యార్థుల్లో రోగ నిరోధకశక్తి పెరుగుతుందని, ఎదుగుదల ఉంటుందని వివరించారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. చిన్నప్పటి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యాను అందించినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోవడం జరుగుతుందన్నారు.

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సైదులు, కనకయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపికళ, ఉపాధ్యాయులు సత్తయ్య, అమృతమ్మ, భాస్కర్, నాగరాజు, బాల్ రెడ్డి, పీఏసిఎస్ డైరెక్టర్ భూమయ్య, వివిధ పార్టీల నాయకులు దయానంద్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఆఫీస్ పై దాడి హేయమైన చర్య

■ బీజేపీ కుకునూరుపల్లి మండల అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి

✍ జయభేరి, కుకునూర్పల్లి, జనవరి 08 :



బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్య అని బీజేపీ కుకునూరుపల్లి మండల అధ్యక్షులు అనుముల సంపత్ రెడ్డి మండి పడ్డారు. కుకునూరు పల్లి మండల కేంద్రంలోమాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో రోజు రోజుకు కాంగ్రెస్ నాయకుల ఆగడాలు మితి మీరిపోతున్నాయని ధ్వజమెత్తారు. బీజేపీ పార్టీ ప్రధాన కార్యాలయంపై దాడి చేయడానికి సాహసం చేశారంటే కాంగ్రెస్ ఎంతకు బరి తెగించిందో అర్థమవుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయలేక రోజుకో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి సర్కార్ ను బీజేపీ నిలదీస్తుంటే వారికి మింగుడు పడటం లేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, పరిపాలన చేత గాక అల్లర్లు సృష్టించాలని కాంగ్రెస్ ఉద్దేశ్యమా అంటూ ఘాటుగా ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణను ఏం చెయ్యాలని అనుకుంటున్నారని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. హైదారాబాద్ లో శాంతి భద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వమే అశాంతి చెలరేగేలా దాడులు సంస్కృతికి తెర లేపిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి కవ్వింపు చర్యలు వెంటనే మానుకోవాలని, బీజేపీ తలచుకుంటే కాంగ్రెస్ పార్టీ కనుమరుగు అవుతుందని హెచ్చరించారు. పార్టీ కార్యాలయంపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. లేకపోతె బీజేపీ శ్రేణులు చూస్తూ ఊర్కోరనే విషయం సిఎం రేవంత్ రెడ్డి, టీపిసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లు గ్రహించి మసలుకోవాలని సూచించారు.

## కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేష కృషిచేయాలి

■ జమ్మికుంట మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా నియమితులైన వీరమనేని పరుశురాం, జమ్మికుంట టౌన్ అధ్యక్షులు సుంకరి రమేష్ నీ యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల శాఖ ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది.

✍ జయభేరి, జమ్మికుంట :



DCC అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాలతో హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ నాయకత్వంలో ఇటీవల నూతనంగా మండల పార్టీ అధ్యక్షులను నియమించడం జరిగినది. అందులో భాగంగా జమ్మికుంట మండల పార్టీ అధ్యక్షులుగా వీరమనేని పరుశురాంని, జమ్మికుంట టౌన్ అధ్యక్షులు సుంకరి రమేష్ నీ నియమించిన సందర్భంగా జమ్మికుంట మండల యూత్ కాంగ్రెస్ పక్షాన సన్మానం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు సూచనలు, సలహాలతో జమ్మికుంట మండలంలో పార్టీ పూర్వ వైభవం తీసుకురావాలని, నూతన ఒరవడి సృష్టించాలని, గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి విశేష కృషిచేయాలని అధ్యక్షులను కోరుతూ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు అన్నం ప్రవీణ్, యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శులు అజయ్, రవి, అరుణ్, ఇల్లంతకుంట యూత్ వైస్ ప్రెసిడెంట్ రాజు, కారింగుల రాజేందర్ నాయకులు ప్రశాంత్, సూర్య, జావిద్, బాను, అంజి, దీపక్ తదితరులు పాల్గొన్నారు.




## వృదాగా పోతున్న త్రాగునీరు చోద్యం చూస్తున్న పంచాయతీ అధికారులు

✍ జయభేరి, పరవాడ:

మండల కేంద్రం అయ్యిన పరవాడలో సినిమాహల్ జంక్షన్ నాలుగు రోడ్డుల కలయిక వద్ద పంచాయతీ నుంచి సరఫరా అవ్వుతున్న వీధి కొళాయి దెబ్బ తిని గత రెండు రోజులు నుంచి త్రాగునీరు వృదాగా పోతుంది.కొళాయి దెబ్బతిని నీరు వృధాగా పోతుందని తెలిసిన పంచాయతీ అధికారులు కానీ నాయకులు కానీ చర్యలు చెప్పట్టే సూచనలు కనపడకపోవడంతో ప్రజానీకం అసహనం వ్యక్తం చేస్తున్నారు.ఈ నీరు ప్రవాహం సుమారు అర కిలోమీటర్ వరకు ప్రధాన రహదారి వెంబడి ప్రవాహస్తూ ఉండడంతో అటుగా ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.ఈ సమస్యపై పంచాయతీ అధికారులు, నాయుకులు త్వరగా స్పందించి దెబ్బతిన్న కోలాయిని తొందరగా బాగుచేసే పనులు చేపట్టాలని త్రాగునీరు వృదా అవ్వకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజానీకం కోరుతున్నారు.

## పెదముషిడివాడ గ్రామంలో గ్రావెల్ తవ్వకాలు



✍ జయభేరి, పరవాడ:

పరవాడ మండలం పెదముషిడివాడలో గ్రామంలో గ్రావెల్ దొంగలు రెచ్చిపోతున్నారు. గెడ్డలు వాగులు, కొండలు, చెరువులను కొల్లగొట్టి మట్టిని, గ్రావెల్ ను మింగేస్తున్నారు. రోజూ ఈ పంచాయతీలో ఏదో ఒకచోట అక్రమ తవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. స్థానిక హైస్కూల్ ఎదురుగా తుమ్మల బందలో నాలుగు రోజులుగా మట్టిని తవ్వేస్తున్నారు.చీకటి పడితే చాలు మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారని దీనిపై రెవెన్యూ అధికారులకు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ అసలు పట్టించుకోనే సాహసం చెయ్యడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.


## సమాచార హక్కు చట్టం రక్షణ సమితి క్యాలెండర్ ఆవిష్కరణ



✍ జయభేరి, దేవరకొండ :

పట్టణంలో సమాచార హక్కు చట్టం రక్షణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని అడిషనల్ ఎస్పీ, ఆర్డీవో తాసిల్దార్ ఎంపీడీఓ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం రక్షణ సమితి నూతన క్యాలెండర్ ను అడిషనల్ ఎస్పీ పి. మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. సందర్భంగా క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం రాష్ట్ర అధ్యక్షులు కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం 2005 పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ అధికారుల పనితీరును ప్రశ్నించే హక్కు కేవలం సమాచార హక్కు చట్టం 2005 ద్వారనే సాధ్యమన్నారు. సమాచార హక్కు చట్టం 2005 ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే పనితీరు,కార్యక్రమాలను తెలుసుకోవచ్చాన్నారు. సమాచార హక్కు చట్టం యొక్క ప్రాథమిక లక్ష్యం పౌరులకు సాధికారత కల్పించడం, ప్రభుత్వ పనిలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ప్రోత్సహించడం, అవినీతిని అరికట్టడం మన ప్రజాస్వామ్యాన్ని నిజమైన అర్థంలో ప్రజల కోసం పనిచేసేలా చేయడం పాలనా సాధనాలపై అవసరమైన నిఘా ఉంచేందుకు పాలించిన వారికి ప్రభుత్వం మరింత జవాబుదారీగా ఉండేలా మెరుగ్గా అమర్చబడి ఉంటుంది. ప్రభుత్వ కార్యకలాపాల గురించి పౌరులకు తెలియజేయడానికి ఈ చట్టం బ్రహ్మాస్త్రం లా ఉంటుందని అని ఆయన అన్నారు. వారితో పాటు రాష్ట్ర ప్రధాన అజీజ్ మహమ్మద్ , కార్యదర్శి పగిడిమర్రి యాదగిరి కోశాధికారి ఆనంద్, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన బాబు మృతి



✍ జయభేరి, దేవరకొండ :

బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం దేవరకొండ మండలం మర్రిచెట్టు తండాకు చెందిన మూడావత్ రాహుల్ భార్య నందిని మంగళవారం మధ్యాహ్నం పురిటినొప్పులతో దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి లోనార్మల్ కాన్పు కోసం డాక్టర్లు వెయిట్ చేయించారు. రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారి నొప్పులు ఎక్కువ కావడంతో మొదట నార్మల్ కాన్పు చేసే ప్రయత్నంలో భాగంగా విఫలం కావడంతో ఆపరేషన్ చేశారు. బాబు ఉమ్మనీరు బాగా తాగాడని పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ కు తరలించాలని డాక్టర్ల సూచన మేరకు తీసుకెళ్లగా మార్గమధ్యంలో బాబు మృతి చెందాడు. బాబు మృతదేహంతో ఆసుపత్రి చేరుకున్న బంధువులు.. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే అప్పుడే పుట్టిన బాబు మృతి చెందాడని ఆరోపిస్తూ.. ఆస్పత్రిలోని ఫర్నిచర్ ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. దేవరకొండ పోలీసులు ఆసుపత్రి చేరుకొని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. జనసేన పార్టీ బంజారా సినీ హీరో చందు నాయక్ బాధితులకు న్యాయం జరగాలని డాక్టర్ల నిర్లక్ష్యం వల్లనే బాబు చనిపోయినాడు అని ఆవేదన వ్యక్తం చేశారు.




# ఇప్పుడు గుర్తిస్తున్నారు

'సినిమాల్లో నటించే అవకాశం అందరికీ రాదు. అదొక గొప్ప అదృష్టం. ఉత్తమమైన కథల్ని ఎంపిక చేసుకుంటూ ప్రేక్షకులకు గుర్తుండిపోయే పాత్రల్ని పోషించాలనుకుంటున్నా. ఏ పాత్ర చేసినా సామాజిక బాధ్యతతో వ్యవహరించాలన్నదే నా లక్ష్యం' అని చెప్పింది ఐశ్వర్య రాజేష్. ఆమె వెంకటేష్ సరసన కథానాయికగా నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం ఐశ్వర్యరాజేష్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'ఈ సినిమా నరేషన్ టైంలో నవ్వాపుకోలేపోయా. అంత గొప్పగా కామెడీ పండింది. ఈ సినిమాలో నేను భాగ్యం అనే ఇల్లాలి పాత్రలో కనిపిస్తా. భిన్న భావోద్వేగాలతో సాగే పాత్ర ఇది. ఏ కొంచెం బ్యాలెన్స్ తప్పినా పాత్ర ఔచిత్యం దెబ్బతింటుంది. అందుకే చాలా సెటిల్డ్ పర్ఫార్మెన్స్ కనబరిచేందుకు ప్రయత్నించా' అని చెప్పింది. వెంకటేష్ వంటి సీనియర్ నటుడితో కలిసి నటించడం చాలా ఆనందంగా ఉందని, 'భాగ్యం క్యారెక్టర్‌లో అదరగొడుతున్నావ్' అంటూ ఆయన ఎప్పుడూ ప్రోత్సహించేవారని ఐశ్వర్య రాజేష్ పేర్కొంది. సినిమాలోని 'గోదారి గట్టు..' పాట బాగా పాపులర్ అయిందని, గతంలో ఎయిర్‌పోర్ట్‌కి వెళితే తనను అంతగా గుర్తుపట్టేవారు కాదని, ఇప్పుడు మాత్రం కనిపిస్తే చాలు చుట్టూ చేరి ఫొటోలు తీసుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేసింది. భాగ్యం వంటి పాత్ర గత ఐదారేళ్లుగా తెలుగు సినిమాలో రాలేదని, క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'సంక్రాంతికి వస్తున్నాం' అందరినీ ఆకట్టుకుంటుందని ఐశ్వర్య రాజేష్ చెప్పింది.






# నా బలమేమిటో తెలుసు!

'సినిమా ముఖ్యోద్దేశ్యం నటించి మెప్పించడం. తెరపై అందంగా కనిపించడం కాదు. అందుకే నేను గ్లామర్ కంటే అభినయప్రధాన పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తా. తక్కువ సినిమాలు చేసినా సరే నాణ్యమైన కథల్ని ఎంచుకోవాలన్నదే నా అభిమతం' అని చెప్పింది కన్నడ భామ శ్రద్ధా శ్రీనాథ్. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం 'డాకు మహారాజ్'. బాబీ కొల్లి దర్శకుడు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మించింది. ఈ సందర్భంగా బుధవారం శ్రద్ధా శ్రీనాథ్ పాత్రికేయులతో సినిమా విశేషాలను పంచుకుంది. ఈ సినిమాలో తాను నందిని అనే పాత్రలో కనిపిస్తానని, సున్నితమైన వ్యక్తిత్వం కలిగిన మహిళగా లోతైన భావోద్వేగాలతో తన క్యారెక్టర్‌ను తీర్చిదిద్దారని చెప్పింది. 'ఇప్పటి వరకు నేను విభిన్నమైన కథల్లో నటించా. అయితే 'డాకు మహారాజ్' పాత్రం ఓ పూర్తి ప్యాకేజీలా ఉంటుంది. కామెడీ, యాక్షన్, డ్రామా, ఎమోషన్స్ అన్నీ సమపాళ్లలో కుదిరాయి.

# థియేటర్లలో ఓజీ గ్లింప్స్..

## పవన్ కల్యాణ్ ఫ్యాన్స్‌కు డబుల్ ట్రీట్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ పవన్ కల్యాణ్ నటిస్తోన్న మోస్ట్ క్రేజీయెస్ట్ సినిమాల్లో ఒకటి ఓజీ. సుజిత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో గ్యాంగ్ లీడర్
ఫేం ప్రియాంకా ఆరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రియారెడ్డి కీలక పాత్ర పోషిస్తోంది. కాగా షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాకు
సంబంధించిన ఆసక్తికర వార్త మూవీ లవర్స్‌తోపాటు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. తాజా సమాచారం ప్రకారం ఓజీ గ్లింప్స్ సెన్సార్ ఇవాళ
పూర్తయింది. అంతేకాదు ఓజీ గ్లింప్స్ సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదలవుతున్న సినిమాలతో కలిసి స్క్రీనింగ్ కాబోతుందని ఫిలింనగర్ సర్కిల్
ఇన్‌సైడ్ టాక్. గ్లింప్స్ రన్ టైం 1.39 నిమిషాలు. కాగా సుజిత్ ఎలాంటి విజువల్స్‌తో గ్లింప్స్ కట్ చేశాడనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇదే నిజమైతే
ఈ సంక్రాంతికి పవన్ కల్యాణ్ అభిమానులకు రెండు పండగలుండబోతున్నాయన్నమాట. ఇంకేంటి మరి రెడీగా ఉండండి. ఈ మూవీకి ఎస్ థమన్
మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే మేకర్స్
లాంచ్ చేసిన ఓజీ HUNGRYCHEETAH గ్లింప్స్‌లో పవన్ కల్యాణ్ పూర్తిగా నయా అవతార్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు.
ఓజీలో పాపులర్ జపనీస్ నటుడు కజుకి కిటముర, ప్రముఖ థాయ్ యాక్టర్ Vithaya Pansringarm కీలక పాత్రల్లో నటిస్తున్నారు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com